సాగునీరు వరించేనా?

కొండాయిగూడెం చెరువులపై అధికారుల పర్యవేక్షణా లోపం.. ఆయకట్టు రైతుల పాలిట శాపంగా మారింది. చెరువులోని నీరు ఎగువకు పారించి యాసంగి పంటలతో కళకళలాడుతుంటే.. చెరువు ఆయకట్టు దిగువన నీరు లేక పంటలు వెలవెలబోతున్నాయి. చెరువు చుట్టూ ఇష్టారాజ్యంగా సుమారు 100 విద్యుత్ మోటార్లు అమర్చుకుని చెరువులో సాగు నీటిని యథేచ్ఛగా ఎగువ ప్రాంతాలకు తరలించి వినియోగిస్తుండడంతో దిగువకు ఆశించిన స్థాయిలో నీరు పారక చివరి ఆయకట్టు రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆయకట్టు కింద సాగు చేసిన వరి పంట చివరికి ఎండిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. – కామేపల్లి


ఎగువ పంటలకు చెరువు నీటిని తరలించేందుకు ఏర్పాటు చేసిన మోటార్లు

శిఖం ఫుల్.. ఆయకట్టు నిల్..
- విద్యుత్ మోటార్లతో చెరువు నీరు తరలింపు
- దిగువ భూములకు నీరందని వైనం
- అవస్థ పడుతున్న చివరి ఆయకట్టు రైతులు
- కొండాయిగూడెం పెద్దచెరువుపై అధికారుల చిన్నచూపు
- కలెక్టర్ దృష్టి సారించాలని వేడుకోలు


చెరువు శిఖంలో సాగవుతున్న వరి పంట

ఎగువ 300.. దిగువ 100 ఎకరాలు

కొండాయిగూడెం పెద్ద చెరువు ఆయకట్టు 700 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగి ఉంది. వర్షాకాలంలో కూడా ఆయకట్టు చివరికి నీరు అందకపోవడంతో 100 ఎకరాల్లో పొలాలు బీడు భూములుగా ఉన్న పరిస్థితి నెలకొంది. ఇక యాసంగిలో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఆయకట్టు దిగువన పండాల్సిన పంటలు ఎగువన పండిస్తున్న విచిత్ర పరిస్థితి నెలకొంది. గతంలో చెరువు అలుగు పడితే రెండు పంటలకు ఢోకా లేదని భావించిన ఆయకట్టు రైతులు ఇప్పుడు ఆ పరిస్థితి కనబడడం లేదు. చెరువు ఎగువన సుమారు 300 ఎకరాల్లో సాగు చేస్తున్న వివిధ పంటలకు చెరువులోని నీటిని విద్యుత్ మోటార్ల ద్వారా తరలిస్తుంటే.. దిగువన ఉన్న రైతులకు సకాలంలో నీరు అందవని పంటలను సాగు చేయకుండా బీడు భూములుగా వదిలేశారు. దిగువన ఉన్న 100 ఎకరాలకు నీరందక ఎండిపోయే పరిస్థితి దాపురించింది.

అడ్డుకోని అధికారులు

కొండాయిగూడెం పెద్ద చెరువు శిఖంలో పంటల సాగుపై అధికారులు పట్టించుకోవడం లేదు. చెరువు లోతట్టును ఆక్రమించుకుని పంటలను సాగు చేస్తున్నా.. అధికారులు అడ్డుకోవడం లేదు. అంతేకాక చెరువు శిఖంలోనే బావులు తీయడం అక్కడి వరకు విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసుకుని మరీ నీటిని తరలిస్తున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. ఇంతా జరుగుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు మాత్రం చెరువు శిఖంలో పంటల సాగును, విద్యుత్ శాఖ అధికారులు అక్రమ విద్యుత్ వినియోగాన్ని అడ్డుకోలేకపోతున్నారని విమర్శలు వినిపిస్తున్నవి. ఇకనైనా దీనిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి అక్రమంగా చెరువు శిఖంలో సాగును, విద్యుత్ వినియోగాన్ని అరికట్టి ఆయకట్టు రైతులకు అండగా నిలవాలని కోరుకుంటున్నారు.


నీరందక బీడుగా మారిన పంట భూములు

చెరువు లోతట్టు పూడ్చివేత

కొండాయిగూడెం పెద్ద చెరువుకు ఆనుకొని ఉన్న రైతులకు చెరువు కల్పతరువుగా మారింది. అయితే ప్రతి ఏటా చెరువు లోతట్టును చెరువులోని మట్టితో పూడ్చి పంటలను సాగు చేస్తున్నారు. ఫలితంగా చెరువులో నీటి నిల్వ సాంద్రత పూర్తిగా తగ్గిపోతుండడంతో ఆయకట్టు చివరి రైతులు మాత్రం పంటల సాగుకు నీరు అందడం లేదు. దీంతో బావులను తీపించి పంటలకు నీటిని అందిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించాలని ఆయకట్టు రైతులు వేడుకుంటున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే..



కొండాయిగూడెం పెద్ద చెరువుపై అధికారులు చిన్న చూపుతోనే చెరువు శిఖంలో వందల ఎకరాల్లో సాగు చేపడుతున్నారు. అక్రమంగా చెరువు నీటిని విద్యుత్ మోటార్ల ద్వారా ఎగువ ప్రాంతాలకు తరలించి పంటలను సాగు చేస్తుంటే ఆయకట్టు మాత్రం బీడు భూములుగా మారాయి. చెరువు శిఖంలో సాగు చేపట్టకుండా, మోటార్లు అమర్చకుండా, బావులు తీయకుండా చివరి ఆయకట్టుకు నీరందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– యలమద్ది అప్పారావు, కొండాయిగూడెం పెద్దచెరువు ఆయకట్టు మాజీ చైర్మన్

గ్రీవెన్స్ దరఖాస్తులు వెంటనే పరిశీలించాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థలో నిర్వహించే గ్రీవెన్స్‌కు ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను వెంటనే పరిశీలించి, వాటిని పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. సోమవారం కేఎంసీ గ్రీవెన్స్‌లో నగర ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వెంచర్‌లోని గ్రీన్ ల్యాండ్ ఆక్రమణలకు గురవుతున్నాయని 13వ డివిజన్ వాసులు ఆమెకు ఫిర్యాదు చేయగా.. వెంటనే స్వాధీనం చేసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే రెవెన్యూ విభాగం, మున్నేరు వరద సాయం ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని,కార్యాలయానికి వచ్చే దివ్యాంగుల కోసం వీల్ చైర్‌లను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్‌కు మొత్తం 44 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వసుందర, ఏఓ శివలింగం, ఆర్ఓ జి.శ్రీనివాస్, ఏఎస్ఓ లింగయ్య, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య, పబ్లిక్ హెల్త్ ఏఈ, టీఎంసీ తదితరులు పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్‌కు వినతి ఇస్తున్న నగర వాసులు

లింగమంతుల జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: గొల్లగట్టు లింగమంతుల జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించాలని బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం 51వ డివిజన్ నుంచి గొల్లగట్టు లింగమంతుల స్వామి జాతరకు పలువురు యాదవ కుటుంబాలు పెద్ద సంఖ్యలో కదలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మేడారం జాతర తర్వాత అతిపెద్ద జాతర సూర్యాపేట జిల్లా కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో గల దూరాజ్ పల్లి గ్రామంలో జరుగే గొల్లగట్టు లింగమంతుల జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించి రెండు రోజులు సెలవు దినాలుగా ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తాలీముల్ ఇస్లాం మదర్సా వార్షికోత్సవం


సభలో మాట్లాడుతున్న మహ్మద్ అబ్దుల్ ఖవీ

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని గొల్లగూడెంలో గల తాలీముల్ ఇస్లాం మదర్సా వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఆధ్యాత్మిక సభలో ప్రముఖ ఇస్లాం ధార్మిక పండితులు మహ్మద్ అబ్దుల్ ఖవీ మాట్లాడుతూ.. పవిత్ర గ్రంథం ఖురాన్‌ను ప్రతీ ముస్లిం కుటుంబం ప్రేమించాలన్నారు. రేపటి తరం పిల్లలకు ఇస్లాం విద్యతో పాటు ఇంగ్లిష్ మీడియం పాఠ్యాంశాలను బోధించే ఇటువంటి మదర్సాలను ప్రోత్సాహించాలని పేర్కొంటూ మదర్సాలో ఖురాన్ కంఠస్థం చేసిన 12 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మదర్సా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సభలో తెలుగు ఆధ్యాత్మిక ప్రసంగ కర్త ముఫ్తీ సులేమాన్ అజ్మల్, మౌలానా సయిద్ అహ్మద్ ఖాస్మీ, మౌలానా ముఫ్తీ మహ్మద్ జలాలుద్దీన్, ఉలేమాలు, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

రఘునాథపాలెం: వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు ఉపాధి భద్రతతో కూడిన సమగ్రమైన చట్టం రూపొందించాలని తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. సోమవారం రఘునాథపాలెం మండలం జింకలతండా రోడ్డులోని రాష్ట్ర గిడ్డంగుల గోదాంలో టీయూసీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లు ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 55 ఏళ్ల పైబడిన వారికి నెలకు రూ. 6వేల పెన్షన్, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మరణించిన వారికి రూ.10లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 21న ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే మహాసభలకు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్లు వర్కర్స్ రాష్ట్ర నాయకులు సంగయ్య, వెంకటేష్, వినోద్, రమేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ చెక్ పోస్టు తనిఖీ

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్‌లో గల ఖమ్మం వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టును మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు సోమవారం తనిఖీ చేశారు. ఈ కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. చెక్‌పోస్టు తనిఖీపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

అన్నం ఆశ్రమానికి బియ్యం వితరణ


బియ్యం అందిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఖమ్మంఅర్బన్: అన్నం ఫౌండేషన్ అనాథ ఆశ్రమానికి ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల హిందీ-మైక్రో బయాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యాన అధ్యాపకులు, విద్యార్థులు 50 కేజీల బియ్యాన్ని వితరణ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సామాజిక సేవ ఆవశ్యకతపై, నైతిక విలువలు వంటి వివిధ అంశాలపై ఫౌండేషన్ అధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మైక్రో బయాలజీ, హిందీ విభాగాధిపతులు అనితకుమారి, షేక్ గౌస్, అధ్యాపకులు మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

'త్రివేణి'కి అవార్డు

ఖమ్మం సహకారనగర్: విద్యారంగంలో చేస్తున్న కృషికి సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యాన త్రివేణి విద్యాసంస్థకు బెస్ట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ అవార్డు అందించినట్లు త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపుడి వీరేంద్రచౌదరి తెలిపారు. హైదరాబాద్‌లోని లలిత కళాతోరణంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సినీనటుడు రావు రమేష్ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షలో త్రివేణి స్కూల్ విద్యార్థులు లోచన్, జోషిక ప్రతిభ చూపారన్నారు. విద్యార్థులను సోమవారం పాఠశాలలో అభినందించారు. కృష్ణవేణి -త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఇన్‌చార్జ్‌లు కాట్రగడ్డ మురళీకృష్ణ, స్వప్న, ముస్తఫా, అశోక్, చార్లెస్, సందీప్ పాల్గొన్నారు.

ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి

ఖమ్మంరూరల్: ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని, క్వింటా మిర్చికి రూ. 25వేలు ధర నిర్ణయించి ప్రభుత్వమే రైతుల వద్ద నేరుగా కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకుడు అద్దంకి వేలాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కాచిరాజుగూడెంలో రైతు సంఘం నాయకులు మిర్చి కల్లాలను సందర్శించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు రైతులు ప్రభుత్వ విధానాలతో వ్యవసాయం చేయలేని పరిస్థితి నెలకొందని, పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నా పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.సుదర్శన్‌రెడ్డి, వి.వెంకన్న, కె.గురవయ్య, పి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

క్లుప్తంగా

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థిని ప్రతిభ


వెన్నెలకు ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

ఖమ్మంరూరల్: పరిశా సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని జలగంనగర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని పి.వెన్నెలకు ప్రథమ స్థానం లభించినట్లు పాఠశాల హెచ్‌ఎం శ్యాంసన్ తెలిపారు. ఈ సందర్భంగా రూ.10వేలు నగదు బహుమతి, మెమెంటో, ప్రశంసాపత్రంతో పాటు సైన్స్ సబ్జెక్ట్‌లో అత్యధిక మార్కులు సాధించి రూ.1,500 నగదు బహుమతిని అందుకుందన్నారు. ఈమేరకు వెన్నెలను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

న్యాయం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: పాపటపల్లి రైల్వే స్టేషన్ పక్కన ఉన్న భూమి చుట్టూ వేసిన ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పాపటపల్లి గ్రామానికి చెందిన కొదుమూరి శ్రీనివాసరావు కోరారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెట్లను అక్రమంగా నరికి, ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి రవాణా చేశారన్నారు. దీనిపై జిల్లా అధికారులు, ఫారెస్ట్ అధికారులు విచారణ చేసి తనకు న్యాయం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 11 కేవీ అల్లీపురం విద్యుత్ ఫీడర్ లైన్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మమత సెక్షన్ విద్యుత్ ఏఈ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పోలీస్ కాలనీ, శ్రీనగర్‌కాలనీ రోడ్డు నంబర్ 1 నుంచి 7 వరకు, గొల్లగూడెం రోడ్ ఏరియాలో అంతరాయం ఉంటుందని, మధ్యాహ్నం 11.30 నుంచి 2 గంటల వరకు శ్రీనగర్ కాలనీ రోడ్డు నంబర్ 8 నుంచి 16 వరకు అంతరాయం ఉంటుందన్నారు.

వాక్‌దాన్ ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: కేంద్ర మినిస్ట్రీస్ ఆఫ్ పెట్రోలియం సహజ వనరుల ఆధ్వర్యాన నగరంలోని లకారం ట్యాంక్‌బండ్ నుంచి మమత రోడ్ మీదుగా సోమవారం వాక్‌దాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఆయిల్ కంపెనీ లిమిటెడ్ (ఐఓసీఎల్) సూర్యాపేట సేల్స్ ఆఫీసర్ అంకుర్ అశోక్ ఆలో మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకుంటూ ఇంధనం పొదుపుగా ఉపయోగించుకోవాలన్నారు. ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు మేళ్ళచెర్వు వెంకటేశ్వరరావు, నగేష్, వట్టిపల్లి వాసు, శేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో నిర్వహిస్తున్న 17వ జిల్లా స్థాయి రాజీవ్ గాంధీ స్మారక క్రికెట్ పోటీల్లో భాగంగా సోమవారం జరిగిన నాకౌట్ మ్యాచ్‌ల్లో సత్తుపల్లి, నేలకొండపల్లి జట్లు ముందంజలో నిలిచాయి. ఉదయం ఇల్లెందు–నేలకొండపల్లి జట్ల మధ్య మ్యాచ్ జరుగగా నేలకొండపల్లి జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో సత్తుపల్లి–వీ.ఎం. బంజర జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సత్తుపల్లి జట్టు గెలిచింది. రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గప్రసాద్, డాక్టర్ కాట్రగడ్డ యమున, టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండీ.మతిన్‌లు క్రికెటర్లను పరిచయం చేసుకుని మ్యాచ్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, ఇమ్రాన్, శ్రీనివాసరావు, వెంకటేష్, ఇబ్రహీంలు పాల్గొన్నారు.

ఉద్యమకారులను గుర్తించండి

ఖమ్మంరూరల్: తెలంగాణ ఏర్పాటులో ఉద్యమకారుల పాత్రను గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య అన్నారు. మండలంలోని ఆటోనగర్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ చేసిన తప్పిదాలనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేస్తే ఉద్యమకారుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది కానీ ఫలాలు మాత్రం తమకు అందడం లేదని, తమ హక్కుల కోసం ఈనెల 23న కూసుమంచిలో పెద్ద ఎత్తున సభను నిర్వహిస్తున్నామని, ఉద్యమకారులు, నిరుద్యోగ యువత హాజరై సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు కృష్ణ, రాములు, కోయ వెంకటనారాయణ, వీరబాబు, పి.లింగయ్య, ఎం.పద్మ, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ..

35 బీఎన్ఎస్ఎస్ నిబంధనలు సవరించండి


డిప్యూటీ సీఎంకు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాది

ఖమ్మంలీగల్: బాధితులకు అండగా ఉంటుందని 35 బీఎన్ఎస్ఎస్ (41ఏ సీఆర్‌పీసీ) సెక్షన్‌కు గతంలో చేసిన సవరణలు వారికి గుదిబండగా మారాయని, ఆ సెక్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం సవరించాలని ఖమ్మం బార్ అసోసియేషన్ న్యాయవాది తాళ్లూరి దిలీప్ సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు వినతి పత్రం సమర్పించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరచిన విధంగా ఈ సెక్షన్‌ను సవరించాలని కోరారు.

కులగణన రీ సర్వే చేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం నేతలు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేను రీ సర్వే చేయాలని మున్నూరు కాపు సంఘ రాష్ట్ర నాయకులు సోమవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. 42 శాతంగా ఉన్న మున్నూరు కాపు జనాభాను మూడున్నర శాతంగా చూపించడంతో తమకు ప్రభుత్వ అందించే సంక్షేమ ఫలాలు దూరమవుతాయని, తక్షణమే రీ సర్వే చేయించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతి అందించిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, జిల్లా అధ్యక్షులు పార నాగేశ్వరరావు, సంఘం ట్రస్ట్ బోర్డ్ అధ్యక్షులు మేకల బిక్షమయ్య, సీనియర్ నాయకులు గూడపనేని నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సుబాబుల్ ధర తగ్గింపుపై చర్యలు తీసుకోండి

ఖమ్మం మామిళ్లగూడెం: సుబాబుల్, జామాయిల్ ధరను తగ్గించి రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తున్నారని, ధర తగ్గింపుపై చర్యలు తీసుకోవాలని అఖిల పక్ష రైతు సంఘాల నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో రైతు సంఘాల నేతలు కొండపర్తి గోవిందరావు, పొన్నం వెంకటేశ్వరరావు, దొండపాటి రమేష్ మాట్లాడుతూ సుబాబుల్, జామాయిల్ కొనుగోలు చేస్తున్న మూడు కంపెనీలు సిండికేట్‌గా మారి ధర తగ్గిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సమావేశంలో అడపా రామకోటయ్య, వట్టికొండ శ్రీనివాస్, నల్లమోతు శ్రీనివాస్, వేములపల్లి సుధీర్, ఏలూరి నాగేశ్వరరావు, చుంచు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీల వల్ల వ్యవసాయం చేయలేకపోతున్నాం..


మంత్రి పొంగులేటికి ఫిర్యాదు చేస్తున్న బాధిత రైతులు

నేలకొండపల్లి: మండలంలోని అప్పలనరసింహాపురంలో గల ఐరన్, కెమికల్ ఫ్యాక్టరీలతో వచ్చే పొగ, దుమ్ము వల్ల వ్యవసాయం చేయలేకపోతున్నాయని గ్రామానికి చెందిన బాధిత రైతులు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందించారు. సోమవారం ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కోర్లకుంట్ల నాగేశ్వరరావు, బాధిత రైతులు లక్ష్మీనారాయణ, వెంకటనారాయణ, శ్రీనివాసరావు, రమేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల కేంద్రంలో వేసవి కాలంలో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. మిషన్ భగీరథ ద్వారా అందుతున్న వాటర్ సరిపోవడంలేదని, ఎంపీడీఓ, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో వేసిన బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి వినియోగంలోకి తెస్తే తాగునీటి ఇబ్బందులు తొలగిపోతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కొమ్ము పూలే, నేలమర్రి యేసు బాబు, కొమ్ము నితీష్ తదితరులు పాల్గొన్నారు.

పువ్వాడనగర్‌లో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలి

రఘునాథపాలెం: మండల కేంద్రంలోని పువ్వాడ ఉదయ్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలని గ్రామస్తులు సోమవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు. పువ్వాడనగర్‌లో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు ఆలస్యంపై గ్రామం తరఫున కలిసినట్లు తెలిపారు. స్పందించిన కలెక్టర్ డబుల్ బెడ్రూం సముదాయంలో పాఠశాల ఏర్పాటుకు రూ.5లక్షలు పనులు వెంటనే ప్రారంభించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సిద్దిక్, షేక్ రఫీ, సాధిక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

దేశానికి సోషలిజమే ప్రత్యామ్నాయం

ఖమ్మంమయూరిసెంటర్: దేశానికి సోషలిజమే ప్రత్యామ్నాయమని చాటిచెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతతత్వ అజెండాకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. లౌకిక, ప్రజాస్వామిక శక్తులను కూడదీయాలని కోరారు. సోమవారం ఖమ్మంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో పార్టీ సెంటర్ శాఖల సమావేశంలో వారు మాట్లాడారు. నయా ఉదారవాద విధాన వైఖరీ, హిందుత్వ మతతత్వంతో రాజీపడే విషయాల్లో కాంగ్రెస్‌తోనూ విభేదించాలన్నారు. వామపక్ష ఐక్య కార్యాచరణ, ఉమ్మడి వేదికలను బలోపేతం చేయాలన్నారు. ప్రజాసంఘాలను సైతం బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల పొత్తులు, అవగాహనల పేరిట పార్టీ స్వతంత్ర అస్తిత్వం కోల్పోకుండా కార్యకలాపాలు నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, సీనియర్ నాయకులు అలవాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పోతినేని

దార్శనికుడు కేసీఆర్

దేశానికి తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దిన దార్శనికుడు, రాష్ట్ర ఆత్మగౌరవానికి ప్రతీక, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అని పలువురు వక్తలు అన్నారు. సోమవారం కేసీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. పలు చోట్ల మొక్కలు నాటడం, పాలాభిషేకాలు చేశారు. అన్నదానం, పండ్ల పంపిణీ వంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ సాధకుడిగా రాష్ట్రాభివృద్ధికి పాటుపడిన కేసీఆర్ తిరిగి సీఎం కావడం ఖాయమని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. – సాక్షి నెట్‌వర్క్


ఖమ్మం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న తాత మధుసూదన్, సండ్ర, కొండబాల



ఖమ్మంరూరల్: కస్నాతండాలో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు


నేలకొండపల్లిలో మొక్క నాటుతున్న బీఆర్ఎస్ నాయకులు


ఖమ్మంమయూరిసెంటర్: 48వ డివిజన్‌లో కేసీఆర్ చిత్రానికి పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్లు